# అటవీ సంరక్షకులెవరు? విధ్వంసకులెవరు?

**బిజెపి** ప్రభుత్వం, కేంద్రంలోని వారి అనుయాయులు, అడవులపై ఆధారపడి జీవనం సాగించే ఆదివాసులకు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో ద్వేషపూరిత ప్రచారం సాగిస్తూ వస్తున్నారు. వారు అడవులన్నింటినీ దురాక్రమిస్తున్నారని, విచక్షణారహితంగా చెట్లనన్నింటినీ నరికివేస్తున్నారని, గిరిజనులు సాగించే పోడు వ్యవసాయం కారణంగా పర్యావరణమంతా కాలుష్యభరితమౌతోందని, వేట కారణంగా వన్య ప్రాణులకు ముప్పు ఏర్పడుతోందని మాట్లాడుతున్నారు. అడవి, పర్యావరణం విధ్వంసం కావటానికి ఆదివాసులనే నేరస్థులుగా చిత్రిస్తున్నారు. ఆదివాసులను అడవుల నుండి గెంటివేసి, అడవులను, అడవులలోని ఖనిజ, సహజ సంపదల న్నింటినీ కార్పొరేట్లకు, బడా సామ్రాజ్యవాద సంస్థలకు ధారాదత్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది.

దీనిలో భాగంగా, అడవుల సంరక్షణ, వన్యప్రాణుల మనుగడ, పర్యావరణ పరిరక్షణల పేరున భారత అటవీ చట్టం - 1927, అటవీ సంరక్షణ చట్టం-1980, అటవీ వన్యప్రాణుల సంబంధిత జీవవైవిధ్య చట్టాలు, పర్యావరణ చట్టాలను సవరించారు. అయితే అటవీ భూములలో అటవీయేతర కార్యకలాపాలకు విచక్షణారహితంగా అనుమతులివ్వటంతో కేంద్ర పాలకుల మాటలకు, చేతలకు ఎక్కడా పొసగటం లేదు. ఫలితంగా, వన్యప్రాణులు క్షీణిస్తాయి; జంతు, వృక్ష జాతులు ధ్వంసమౌతాయి; పర్యావరణం ఘోరంగా దెబ్బతింటుంది.

గత 15 సం॥ల కాలంలో 3 లక్షల హెక్టార్ల అటవీ భూములను అటవీయేతర కార్యక్రమాలకు మళ్ళించటం జరిగిందని కేంద్ర పర్యావరణ శాఖామంత్రి భూపేంద్రయాదవ్ ఇటీవలే పార్లమెంటు సాక్షిగా పేర్కొన్నాడు. ఈ భూములలో, 58,282 హెక్టార్ల భూమి గనులకు కేటాయించగా, రోడ్ల నిర్మాణానికి 45,326 హెక్టార్లు, నీటిపారుదల రంగానికి 36,620 హెక్టార్లు, విద్యుత్తు ప్రసారలైన్ల కోసం 26,124 హెక్టార్లు, రక్షణ రంగానికి 24,337 హెక్టార్లు, జలవిద్యుత్ కేంద్రాలకు 13,136 హెక్టార్లు, రైల్వేలకు 9,307 హెక్టార్లు, థర్మల్ విద్యుదుత్పత్తికి 4,107 హెక్టార్లు, పవన విద్యుత్తు మౌలిక సదుపాయాలకు 2,181 హెక్టార్లు, అటవీయేతర కార్యక్రమాలకు అత్యధిక అటవీ భూభాగాన్ని ప్రక్కకు మళ్ళించినట్లుగా మనకందుతున్న సమాచారం తెలియజేస్తోంది.

అదే సమయంలో, 3,67,214 హెక్టార్ల రిజర్వు అటవీ ప్రాంతం దురాక్రమించబడిందని మంత్రి గారు శలవిచ్చారు. కార్పొరేట్‌శక్తులు కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించిన కొద్దిరోజుల తర్వాత, మార్చి 17న రిజర్వు అటవీ భూములలో క్యాప్టివ్‌మైన్స్‌కు లీజుకు ఇస్తున్నట్లుగా కేంద్రం ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. అండమాన్, నికోబార్ దీవులలో 'టౌన్‌షిప్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆన్ గ్రేట్ నికోబార్' కోసం 13 వేల హెక్టార్ల అటవీ భూమిని కేటాయించారు. ఇంకా అనేక ప్రాజెక్టులు ఆమోదం పొందవలసినవిగా వున్నాయి.

ఈవిధంగా, అటవీ ప్రాంతాలలో పథకాలకు అనుమతి నీయటం ద్వారా అటవీ, పర్యావరణాల విధ్వంసంలో కేంద్రం అత్యుత్సాహం ప్రదర్శించింది. ఈ ప్రాజెక్టుల అనుమతుల విషయంలో, స్థానిక గ్రామసభల ఆమోదం, 'పీసా' చట్ట నిబంధనలను ఏమాత్రం లక్ష్య పెట్టకుండా వ్యవహరించింది.

అడవుల విచక్షణారహిత విధ్వంసం, పర్యావరణ సూత్రాల విచ్చలవిడి ఉల్లంఘనలతో భూసార క్షీణత పెరిగిపోవటం, అనేక ప్రాంతాలు ఎడారిగా మారిపోవటం, హిమాలయ పర్వత ప్రాంత రాష్ట్రాలలో భీకరమైన వరదలు ఉప్పొంగటం వంటి అనేక పర్యావరణ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అంతే కాదు, వన్యప్రాణులకు, వివిధ రకాల వృక్షజాతులకు, నీటి వనరులకు, ప్రత్యేకించి స్థానిక ఆదివాసీ తెగల మనుగడకే ప్రమాదకరంగా ఈ చర్యలు పరిణమిస్తున్నాయి. దేశ భవితవ్యాన్నే ప్రశ్నార్థకం చేసిన అటవీ చట్టాల సవరణలతో ఈ ప్రమాదకర పరిస్థితులు మరింత తీవ్రమవుతూ ఆందోళన కల్గించేవిగా వున్నాయి. ఈ అంశంలో పర్యావరణవాదుల, మాజీ పౌర అధికారుల, మాజీ ప్రభుత్వోద్యోగుల, ఆదివాసీ సంఘాల, సామాజిక కార్యకర్తల, మేధావుల, ప్రజాస్వామికవాదుల, ఆదివాసీల విజ్ఞప్తులను, నిరసనలను, సూచనలను కనీసంగా పట్టించుకోకుండా ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ప్రభుత్వం యొక్క ఈ చట్టాలు, విధానాలు, చర్యల పట్ల పర్యావరణవేత్తలు తీవ్ర ఆగ్రహం ప్రకటించటంతోపాటు, ఇవన్నీ అటవీ సంరక్షణ చట్టం- 2023 పీఠికలో పేర్కొన్న లక్ష్యాలను తీవ్రంగా విచ్ఛిన్నం చేసేవేనన్నారు. వాతావరణంలో వెలువడే కర్బన ఉద్గారాలను 2070 నాటికి శూన్యస్థాయికి చేర్చాలని, అలానే 2030 నాటికి 2.5-3.5 టన్నుల కార్బన్‌డైఆక్సైడ్‌కు సమానమైన కార్బన్ నిక్షేపాలను సృష్టించాలని పేర్కొన్నదానికి భిన్నమైనవేనన్నారు.

ప్రాజెక్టుల కారణంగా నష్టపోయిన అటవీ భూముల స్థానంలో 9,34,380 హెక్టార్లలో పరిహారాత్మక అడవులను నిర్వహిస్తూ, ఈ తరహా అడవుల పెంపకానికి కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తున్నామని కేంద్రప్రభుత్వం చెబుతోంది. పరిహారాత్మక అడవులు సహజ అడవుల స్థానాన్ని భర్తీచేయలేవని 2016 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు లోనే అంగీకరించింది. పరిహారాత్మక అడవుల పెంపకం అనేది అశాస్త్రీయ, తప్పుడు విధానమని నిపుణులు దీనిపై విమర్శలు చేశారు. "అడవులను నష్టపోవటమంటే కేవలం చెట్లను

కోల్పోవటమే కాదు; ఒక పర్యావరణ వ్యవస్థ కుప్పకూలటం అనీ, నాటిన చెట్లు, కోల్పోయిన అడవుల స్థానాన్ని భర్తీచేస్తాయని ప్రభుత్వం ప్రకటించుకోవచ్చు కానీ, దీని అర్థం-విధ్వంసమైన విశిష్ట వృక్ష, జంతుజాలాన్ని పునరుద్ధరించటం ఎంతమాత్రం కాదని పూనే విశ్వవిద్యాలయ పర్యావరణ శాస్త్ర పిహెచ్‌డి స్కాలర్ సమర్పితరాయ్ పేర్కొన్నారు.

ఏమైనా, ప్రాజెక్టుల కారణంగా సర్వస్వాన్నీ కోల్పోయిన ఆదివాసుల కొరకు, వారి పునరావాసం లేదా వారి జీవనోపాధికి హామీ ఇవ్వటానికి ఉద్దేశించిన పథకాలుగానీ, విధానాలుగానీ కేంద్రం వద్ద ఏమీ లేవు. ఈ ప్రాజెక్టుల ఫలితంగా ఎందరు ప్రజానీకం విస్థాపనకు గురై, అనాథులయ్యారనే సమగ్ర సమాచారం కూడా ప్రభుత్వం వద్దలేదు.

పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పులకు సంబంధించిన మంత్రిత్వశాఖ జనవరి 24న కొన్ని మార్గదర్శక సూత్రాలు విడుదల చేస్తూ "ప్రత్యేక మినహాయింపులున్న పరిస్థితులలో" ఒక హెక్టారు వరకు అటవీ ప్రాంతాన్ని నివాస ప్రాంతాల పథకాలకు మళ్ళించవచ్చని అందులో పేర్కొన్నారు. ఆ "ప్రత్యేక మినహాయింపులతో కూడిన పరిస్థితు"లేమిటనేది మాత్రం ప్రభుత్వం పేర్కొనలేదు. ఇది ధనికవర్గాలకు చెందిన ఫార్మ్‌హౌస్‌లు, నివాసాలు, గెస్ట్‌హౌస్‌లు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీస్‌కు మినహా, ఆదివాసుల, పేద ప్రజానీకపు నివాస వసతికి ఉద్దేశించినది మాత్రం కాదు. ఉదాహరణకు, గత సం॥రం, బిజెపి పాలిత హర్యానా రాష్ట్ర ప్రభుత్వం, ఢిల్లీ శివారులలో గురుగావ్‌కు చెందిన అటవీ భూమిలో కార్మికవర్గ నివాస స్థావరాలైన 10,000 గుడిశెలను కూల్చివేసింది. అదే సమయంలో, ఆ ప్రాంతంలోనే నిర్మితమైవున్న ధనిక వర్గాల ఫాంహౌస్‌ల వైపు కన్నెత్తికూడా చూడలేదు. భూమి పట్టాల కోసం, భూమిపై శాశ్వత హక్కుల కోసం గ్రామసభల ద్వారా ఆదివాసులు పెట్టుకొన్న దరఖాస్తులన్నింటినీ దశాబ్దాల కాలంగా నిరాకరించటమో లేదా ఎటూ తేల్చకుండా నిలిపివేయటమో జరుగుతూవస్తోంది. మరోవైపున కార్పొరేట్లకు, ధనికవర్గాలకు అడవులను యథేచ్ఛగా కట్టబెట్టటానికి అంతో ఇంతో ఆటంకంగా వున్న చట్టాలన్నింటిలో కేంద్రం నిరంతరాయంగా, చాలా దృఢంగా మార్పులు చేస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నది.

'ఇండియన్ స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్టు'-2021 (ఐఎస్‌ఎఫ్‌ఆర్) ప్రకారం దేశ భౌగోళిక ప్రాంతమంతటిలో 7,13,789 చ॥కి॥మీ వైశాల్యంలో 21.71 శాతంగా అటవీ ప్రాంతం విస్తరించి వుంది. ఏమైనా, ఈ దట్టమైన, మధ్యతరహా అడవుల పరిమాణం తగ్గిపోయింది. ఆదివాసుల నిలకడైన ఆందోళనల కారణంగా వారు నివాసముండే అటవీ ప్రాంతాలలో దట్టమైన అడవులు మాత్రమే ఇంకా చెక్కుచెదరకుండా వున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. "నూతన నివేదిక ప్రకారం గిరిజనుల భూమిపై సామూహిక హక్కులను ప్రభుత్వాలు ఎక్కడైతే నికరంగా గుర్తించాయో, ఆ ఆదివాసీ, మూలవాసుల భూభాగాలలో అటవీ నిర్మూలనా శాతం పరిగణించదగిన స్థాయిలో తక్కువగా వుంది". (డౌన్ టు ఎర్త్-30-3-2021)

ఆదివాసులకు పోడుచేసుకోవటం, వేట, అటవీ ఉత్పత్తులే ప్రధాన జీవనాధారం. భారతదేశంలో సుమారు 6 లక్షల కుటుంబాలు 17 లక్షల 30 వేల హెక్టార్లలో పోడు వ్యవసాయం చేస్తున్నారని, ఇది కూడా ప్రధానంగా ఈశాన్య రాష్ట్రాలలో జరుగుతోందని ఒక నివేదిక పేర్కొంది. ప్రాజెక్టులు, గనుల తవ్వకం మొదలైన కారణాలతో ఆదివాసులను అడవుల నుండి గెంటివేయటం; పోడు వ్యవసాయంలో నూతనంగా ఎదిగివస్తున్న తరాలకు ఆసక్తి సన్నగిల్లటం వంటి కారణాలుగా పోడు వ్యవసాయం తగ్గుతోంది. పోడు వ్యవసాయం ఒక ప్రాంతంలో కొంతకాలం చేసి, మరోచోట కొత్తగా పోడు వ్యవసాయం ప్రారంభించినప్పటికీ, మొదట పోడు చేసిన ప్రాంతపు భూమిలో కొంతకాలానికి తిరిగి సహజంగానే అడవి పెరుగుతుంది. కలప కాంట్రాక్టుల పేరిట, ప్రాజెక్టుల పేరిట జరుగుతున్న అటవీ నిర్మూలనకు వ్యతిరేకంగా ఆందోళనలు జరపని ఆదివాసులే లేరంటే అతిశయోక్తి కాదు. మూలవాసులు తమ ఆహారం కోసం సాగించే వేట కారణంగానే వన్యప్రాణులు క్షీణించిపోతున్నాయని చెప్పటం కూడా సరైంది కాదు; అటవీయేతర ప్రయోజనాల కోసం వన్యప్రాణుల ఆవాస ప్రాంతాలను ధ్వంసం గావించటం వలననే, అవి క్షీణించిపోతున్నాయని అనేక అధ్యయనాలు చూపుతున్నాయి.

ఛత్తీస్‌ఘర్‌లోని 'హస్‌దెయో అరండ్' అడవిలో మధ్యప్రదేశ్‌లో మహన్ అడవి, ఒడిషాలోని తలబిరా అడవి, ఆరావళీ పర్వతాలలోని అడవులలో, గనుల త్వవకానికి బాక్సువాహా వజ్రాల గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆదివాసీ కార్యకర్తలను, ఆదివాసులను చట్టవిరుద్ధంగా అరెస్టులు చేయటమేగాకుండా హత్యకావించటం కూడా జరుగుతోంది.

అడవి తల్లిని దైవంగా భావిస్తూ అడవుల విధ్వంసానికి వ్యతిరేకంగా పోరాడుతూ, అనాది కాలం నుండీ అడవులను పరిరక్షించుకుంటూ వస్తున్నది ఆదివాసులే! ప్రభుత్వాలు పైకి ప్రకటిస్తున్న అటవీ సంరక్షణలనేవి గొప్పమోసపూరితమైనవని పైన పేర్కొన్న కేవలం కొన్ని అంశాలపై ఆధారపడే మనం చెప్పవచ్చు. అటవీ పరిరక్షకులెవరో, అటవీ విధ్వంసకులెవరో కూడా స్పష్టమౌతుంది. దీనికి ప్రధాన కారణం పాలకుల విధానాలు, వారి దోపిడీనే. కనుక ఆదివాసులను అడవుల నుండి తరిమివేసి అడవులను భారీగా లూటీ చేసేందుకు, అధికస్థాయిలో అడవులను ధ్వంసం చేస్తూ, పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్న కార్పొరేట్లకు, సామ్రాజ్యవాద సంస్థలకు అడవులనంతా అప్పగిస్తున్న కేంద్రప్రభుత్వ దుర్మార్గమైన, ప్రజావ్యతిరేకమైన విధానాలపై ప్రజలంతా కలిసికట్టుగా పోరాటం సాగించాలి.

*****